క్లుప్తంగా

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

పుత్తూరు రూరల్: స్థానిక మెయిన్‌లో నందు ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు బి.భాస్కర్‌రాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాచపాళెం గ్రామానికి చెందిన స్వయంకృషి జనహిత స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తిరుపతికి చెందిన శ్రీవేంకటేశ్వర అరవింద్ కంటి ఆస్పత్రి వారిచే కంటి పరీక్షలు నిర్వహించి, ఉచిత ఆపరేషన్లు చేయడం జరుగుతుందని వివరించారు.

జేవీకే కేంద్రం పరిశీలన



నింద్రలో సామగ్రి పరిశీలిస్తున్న అధికారులు

నింద్ర: ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నాడు–నేడు ద్వారా ప్రతి పాఠశాలలో మౌలిక వసతులు కల్పిస్తామని రాష్ట్ర జేవీకే కోఆర్డినేటర్ వెంకటరమణ రెడ్డి అన్నారు. శనివారం నింద్ర పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 47 పాఠశాలలోని విద్యార్థులకు ఈ విద్యాసంవత్సరానికి కావలసిన జగనన్న విద్యాకానుకను పంపిణీకి కావలసిన సామగ్రి విలువ చేసినట్లు ఆయన తెలిపారు. అనువైన ప్రాంతం నింద్ర ఉన్నత పాఠశాలను ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఈ నెల 15 నుంచి ప్రారంభించి పాఠశాల ప్రారంభంలోపు పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీ క్వాలిటీ చెకింగ్ అధికారి గీత, ఎంఈఓ నారాయణ, ఏపీఎం చంద్రకళ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు హనుమాన్ జయంతి

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎన్ కండ్రిగ సమీపంలోని అరుణగిరిపై ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం హనుమాన్ జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా దేవళంపేటలోని భక్తాంజనేయ స్వామి, మాకమాంబాపురం సమీపంలోని ఆంజనేయ స్వామి ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈమేరకు ఘనంగా ఏర్పాట్లు చేశారు.

బైక్‌లు ఢీకొని వ్యక్తికి గాయాలు



గాయపడిన గోపాలకృష్ణన్

వడమాలపేట: రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఓ వ్యక్తికి తీవ్రంగా గాయపడిన సంఘటన శనివారం మండలంలోని అంజేరమ్మ కనుమ దగ్గర జరిగింది. వివరాలు ఇలా.. చెన్నైకి చెందిన గోపాలకృష్ణన్ దంపతులు ద్విచక్రవాహనంపై తిరుమలకు వెళ్తుండగా మార్గమధ్యలోని పుత్తూరు–తిరుపతి జాతీయ రహదారిపై మండలంలోని అంజేరమ్మ కనుమ వద్ద వెనుక వస్తున్న మరో బైక్‌ను ఢీకొనడంతో గోపాలకృష్ణన్ తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్థానికులు స్పందించి 108 ఆస్పత్రికి తరలించారు. స్థానిక పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

తాగునీటి పైపులైన్‌కు మరమ్మతులు



మరమ్మతుల అనంతరం బోరులో నుంచి వస్తున్న నీరు

విజయపురం (నగరి): మండలంలోని మల్లారెడ్డికండ్రిగ బీసీ కాలనీలో ఉన్న బోరుబావిలో పైపులైన్ మరమ్మతులకు గురైంది. మంత్రి ఆర్కే రోజా ఆదేశాల మేరకు సర్పంచ్ జయమ్మ శనివారం పైపులైన్‌ను సరి చేయించి తాగునీటి సరఫరాను పునరుద్ధరించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు మంత్రి రోజాకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యాకానుక కిట్ల పరిశీలన

నగరి: మండలంలోని జగనన్న విద్యాకానుకను స్టేట్ అబ్జర్వర్ గీతా, జిల్లా అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ వెంకటరమణారెడ్డి శనివారం పరిశీలించారు. పీసీఎన్ ఉన్నత పాఠశాలలో ఉన్న జగనన్న విద్యాకానుక కిట్లను భద్రపరిచిన గదులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం జగనన్న విద్యాకానుక సమగ్ర శిక్షణలో పనిచేస్తున్న సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట ఎంఈఓ శ్రీదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

విజయపురంలో..

విజయపురం మండలంలో ఎంఆర్సీ భవనంలో నిల్వ ఉన్న జగనన్న విద్యాకానుకను స్టేట్ అబ్జర్వర్ గీత, జిల్లా యంత్రాంగం శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా జగనన్న కానుకను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె వెంట ఎంఈఓ ఆంజనేయులు ఉన్నారు.

పంపిణీకి సిద్ధంగా విద్యాకానుక

రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక విద్య, వైద్యరంగానికి పెద్దపీట వేస్తోంది. ముఖ్యంగా విద్యార్థుల ఆరోగ్యం పట్ల కానీ, చదువుల విషయంలో ప్రభుత్వ చర్యలు సత్ఫలిస్తున్నాయి. అందుకు ఇటీవల వెలువడిన పదో తరగతి ఫలితాలే నిదర్శనం. ఏటా స్కూళ్లు తెరిచిన రోజే జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేస్తున్న సర్కారు ఈ ఏడాది కూడా విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి పంపిణీ చేసేలా చర్యలు చేపట్టింది. ఇప్పటికే విద్యాకానుక కిట్లను ప్రభుత్వం అన్ని జిల్లాలకు పంపిణీ చేయగా, అక్కడి నుంచి మండలాలకు చేరాయి.



నగరిలో జగనన్న విద్యాకానుకను పరిశీలిస్తున్న రాష్ట్ర అబ్జర్వర్ గీత, ఎంఈవో శ్రీదేవి

- మండల కేంద్రాలకు చేరిన జగనన్న విద్యాకానుక కిట్లు
- స్కూళ్లు ప్రారంభమైనే రోజునే పంపిణీ చేసేలా ఏర్పాట్లు

విజయపురం (నగరి): స్కూళ్లు తెరిచిన తొలిరోజే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందనున్నాయి. ఇప్పటికే 100 శాతం పాఠ్యపుస్తకాలతో పాటు విద్యార్థులకు అవసరమైన యూనిఫాం, ఇతర విద్యాసామగ్రి ఉన్న జగనన్న విద్యాకానుక కిట్లు మండల కేంద్రాలకు చేరాయి. గతంలో స్కూళ్లు తెరిచిన రెండు, మూడు నెలల వరకు కూడా పూర్తిస్థాయిలో పుస్తకాలు అందేవి కాదు. కానీ నాలుగేళ్ల కిందట వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక విద్యారంగంలో సమూల తీసుకొచ్చారు. ముఖ్యంగా విద్యార్థుల ఆరోగ్యంపైన ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ఇప్పటికే ప్రభుత్వ స్కూళ్లను నాడు–నేడు ద్వారా అత్యంత అద్భుతంగా తీర్చిదిద్దిన విషయం విదితమే. ప్రభుత్వం చేపడుతున్న చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. ఇటీవల వెలువడిన పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ స్కూల్ విద్యార్థులే టాపర్లుగా నిలవడం గొప్ప విషయం. ఈసారి కూడా జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేసేందుకు ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది.

కిట్‌లో ఏమి ఉంటాయంటే..!

ప్రభుత్వం అందించే జగనన్న విద్యాకానుక కిట్‌లో బ్యాగు, పాఠ్య పుస్తకాలు, బూట్లు, బెల్టు, రెండు జతల సాక్సులు, మూడు జతల యూనిఫాం, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ, నోటు పుస్తకాలు ఉంటాయి. ఏటా జూన్‌లోనే విద్యాకానుక కిట్లను పంపిణీ చేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అంతకుముందు జూన్ రాగానే తల్లిదండ్రులకు పాఠ్యపుస్తకాలు, విద్యాసామగ్రి కొనుగోలు పెద్దసవాల్‌గా ఉండేది. భారీగా జేబులకు చిల్లులు పడేవి. కానీ ఇప్పుడా పరిస్థితి లేదు.

వందశాతం వచ్చేశాయి..

నగరి నియోజకవర్గంలో నగరి, పుత్తూరు, విజయపురం, నింద్ర, వడమాలపేట మండలాల్లో మొత్తం 304 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా అందులో 238 ప్రాథమిక, 24 యూపీ, 42 హైస్కూళ్లు ఉన్నాయి. ఇందులో 21,460 మంది చదువుతున్నారు. వీరికి రానున్న 2023–24 విద్యా సంవత్సరంలో అందించాల్సిన జగనన్న విద్యాకానుక కిట్లు ఆయా మండల కేంద్రాలకు చేరాయి.

స్కూళ్లు తెరిచిన రోజే పంపిణీ..



2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి పంపిణీ చేయాల్సిన జగనన్న విద్యాకానుక కిట్లు మండల కేంద్రానికి వచ్చాయి. పాఠశాల ప్రారంభం రోజే విద్యార్థులకు బ్యాగు, బూట్లు, బెల్టు, రెండు జతల సాక్సులు, మూడు జతల యూనిఫాం, ఆక్స్‌పర్డ్ డిక్షనరీ, నోటు పుస్తకాలు అందిస్తాం. మొదటి రోజే ఇవ్వడం వల్ల పిల్లలకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది.

–ఆంజనేయులు, ఎంఈఓ, విజయపురం

జూన్ వస్తే భయపడేవాళ్లం..



గతంలో స్కూల్ తెరుస్తున్నారంటే భయపడేవాళ్లం. పిల్లలకు నోటుపుస్తకాలు, బ్యాగు, యూనిఫాం కొనడానికి చాలా ఖర్చు అయ్యేది. జగనన్న సీఎం అయ్యాకా మాకు అలాంటి భయం లేదు. బడి తెరిచిన రోజే మా పిల్లలకు అవసరమైన నోటుపుస్తకాలు, యూనిఫాంతో ఉన్న జగనన్న విద్యాకానుక కిట్లు అందిస్తున్నారు.

–సుశీల, విద్యార్థిని తల్లి, వేపగుంట

బాగా చదువుకుంటున్నాం..



నేను వేపగుంట ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నాను. ఈ ఏడాది 9వ తరగతికి వెళ్తున్నాను. ప్రతి సంవత్సరం స్కూల్ తెరిచే రోజే నాకు బ్యాగు, నోటుపుస్తకాలు, యూనిఫాం అన్ని ఇస్తున్నారు. ఇలా ఇవ్వడం చాలా సంతోషంగా ఉంది. 8వ తరగతిలో నాకు ట్యాబ్ కూడా ఇచ్చారు. సీఎం జగన్ మామ వచ్చాకా మేము బాగా చదువుకుంటున్నాం.

–లిఖిత, విద్యార్థిని, వేపగుంట

నేడు మంత్రి రోజా పర్యటన

నగరి: మంత్రి ఆర్‌కే రోజా ఆదివారం నిర్వహించే పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఉదయం 9 గంటలకు తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతర మహోత్సవాన్ని పురస్కరించుకుని తిరుపతి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో తాళ్లపాక గంగమ్మ ఆలయం నుంచి కాలినడకన వెళ్లి తాతయ్య గుంట గంగమ్మకు పట్టువస్త్రాలు సమర్పిస్తారు. సాయంత్రం 5 గంటలకు వడమాలపేట మండలం కాయం గ్రామంలో రామాలయం దగ్గర ది వరల్డ్ కమ్యూనిటీ సర్వీస్ సెంటర్–విలేజ్ సర్వీస్ ప్రాజెక్ట్ వారి యోగా శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు.

విజేతలకు బహుమతుల అందజేత



టోర్నీ విజేత మాధవరం జట్టుకు బహుమతి అందిస్తున్న వైస్ ఎంపీపీ బాలాజీ

విజయపురం (నగరి): మండలంలోని మాధవరంలో మూడు రోజులు పాటు జరిగిన క్రికెట్ టోర్నమెంట్ విజేతగా నిలిచిన జట్టు వైస్ ఎంపీపీ మంజుబాలాజీ శనివారం బహుమతులు అందజేశారు. మాధవరం పంచాయతీలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున మూడు రోజుల పాటు నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ శనివారం ముగిసింది. ఇందులో విజేతగా నిలిచిన మాధవరం జట్టుకు మొదటి బహుమతిగా రూ.5 వేలు, రన్నరప్‌గా నిలిచిన అత్తూరు జట్టుకు రూ.3 వేలు, మూడోస్థానంలో నిలిచిన మాధవరం జూనియర్ టీంకు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు గోపీనాథ్, మురళీకృష్ణ, ప్రసన్నకుమార్, ప్రసాద్, పాండియన్ పాల్గొన్నారు.

రాజీమార్గమే రాజమార్గం





పుత్తూరులో కేసులను పరిష్కరిస్తున్న జడ్జి రాఘవేంద్ర, నగరిలో కేసులు పరిష్కరిస్తున్న న్యాయవాదులు

పుత్తూరు రూరల్: స్థానిక సబ్‌కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 477 కేసులను పరిష్కరించినట్లు సీనియర్ సివిల్‌జడ్జి ఎస్.సీ.రాఘవేంద్ర తెలిపారు. రాజీమార్గమే రాజమార్గమని, కక్షిదారుల మధ్య రూ.1,16,78,674 రాజీ చేసినట్లు చెప్పారు. 441 క్రిమినల్ కేసులు, 24 సివిల్, 12 ప్రీ లిటిగేషన్ కేసులను పరిష్కరించినట్లు వివరించారు. లోక్ అదాలత్ ప్రిసీడింగ్ ఆఫీసర్లుగా సీనియర్ సివిల్‌జడ్జి ఎస్‌సీ రాఘవేంద్ర, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సి.జానకి, అడిషనల్ జూనియర్ సివిల్ వి.గోపాలకృష్ణ వ్యవహరించారు. బెంచ్ మెంబర్‌గా న్యాయవాది సురేష్‌బాబు పాల్గొన్నారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, ఇతర న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.

నగరిలో..

నగరి: స్థానిక జూనియర్ సివిల్ మేజిస్ట్రేట్ కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో పర్మనెంట్ ఇంజెక్షన్ 02, డిక్లరేషన్ 01, నగదు 01, డీవీసీ 01, ఐపీసీ 16, ఆర్‌సీఎస్ 01, బ్యాంకు పీఎల్‌పీ 28, ఫస్ట్ క్లాస్ అడ్మిషన్ 08, సెకండ్ క్లాస్ అడ్మిషన్ 221, మొత్తం 279 కేసులు పరిష్కరించారు. తద్వారా మొత్తం రూ.26,02,500 వసూలు అయింది. ఫస్ట్ అడిషనల్ సివిల్‌జడ్జి సత్యకాంత్‌కుమార్, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ నెల్సన్‌తో పాటు ఏపీపీ రామశాంతి, డీఎస్పీ రవికుమార్ పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తే చర్యలు



అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ ఎస్ఐ భాస్కర్

కార్వేటినగరం: అక్రమంగా మద్యం వ్యాపారాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ ఎస్ఐ భాస్కర్ తెలిపారు. శనివారం మేజర్ పంచాయతీ కార్వేటినగరం పెద్ద దళితవాడలో జిల్లా ఎక్సైజ్ అధికారుల ఆదేశాల మేరకు అక్రమ మద్యం వ్యాపారాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ యువత మత్తు పానీయాలకు దూరంగా ఉండాలని సూచించారు. బాల్యంలోనే మద్యం, మత్తు పదార్థాలకు అలవాటు పడి బాల్యాన్ని వృథా చేసుకోకూడదన్నారు. అదేవిధంగా విద్యార్థులు, యువత దురలవాట్లకు దూరంగా ఉండాలని, చదువుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ హెడ్‌కానిస్టేబుల్ రవికుమార్, యువత పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల సంబరాలు



సంబరాలు చేసుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

నగరి /కార్వేటినగరం: కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు సందర్భంగా నగరి, కార్వేటినగరం మండలాల నాయకులు సంబరాలు చేసుకున్నారు. శనివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ రాకేష్ రెడ్డి ఆదేశాల మేరకు మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ అల్లా పిచ్చి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పీసీసీ మెంబర్ నటరాజ మొదలియార్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బాబు, చిరంజీవి రెడ్డి, డీసీసీ సెక్రటరీలు ఢిల్లీ, దేశయ్య, మున్సిపల్ పార్టీ ప్రెసిడెంట్ అల్లాపిచ్చి తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా వేంకటేశ్వరుడి గ్రామోత్సవం

వడమాలపేట: టీటీడీ అనుబంధ ఆలయమైన అప్పలాయగుంట శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామివారి తిరుచ్చి గ్రామోత్సవం, ఊంజల్‌సేవ శనివారం వేడుకగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామి వారిని మేల్కొలిపి, తోమాలసేవ, నిత్యకైంకర్యాలు చేపట్టారు. అనంతరం సర్వదర్శనానికి భక్తులను అనుమతించారు. సాయంత్రం ఉభయ నాంచారులతో ప్రసన్న వేంకటేశ్వర స్వామివారిని సర్వాభరణాలు, పూలమాలలతో అలంకరించి వేదమంత్రాలు, భక్తుల గోవింద నామస్మరణల నడుమ శ్రీవారికి ఊంజల్‌సేవ వేడుకగా నిర్వహించారు. అనంతరం సర్వఅలంకారభూషితడైన పద్మావతి ఆండాల్ సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామిని మంగళవాయిద్యాలు, భక్తుల గోవింద నామస్మరణలతో తిరు మాడవీధుల్లో ఊరేగించారు. భక్తులు కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులను సర్వదర్శనానికి అనుమతించారు. రాత్రి స్వామి వారికి ఏకాంత సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు సూర్యకుమారాచార్యులు, ఆలయ టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



తిరుమాడ వీధుల్లో ఊరేగుతున్న ప్రసన్న వేంకటేశ్వర స్వామి

క్షతగాత్రుడికి మంత్రి పరామర్శ

వెదురుకుప్పం: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రుడు సురేష్‌ను ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి పరామర్శించారు. మండలంలోని నచ్చుకూరు గ్రామానికి చెందిన సురేష్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. శనివారం ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, వైఎస్సార్‌సీపీ నాయకులు కలిసి తిరుపతిలోని సాయిసుధ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సురేష్ వద్దకు వెళ్లి ప్రమాద వివరాలు, వైద్యం గురించి వాకబు చేశారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు ఫోన్‌లో సూచించారు. ఆయన వెంట జెడ్పీటీసీలు సుకుమార్(వెదురుకుప్పం), రమణప్రసాద్‌రెడ్డి(శ్రీరంగరాజపురం), మండల పార్టీ అధ్యక్షుడు పద్మనాభ రెడ్డి, బూత్‌కమిటీ నియోజకవర్గ కన్వీనర్ నారాయణరెడ్డి, సీనియర్ నాయకుడు పేట ధనంజయరెడ్డి ఉన్నారు.



వైద్యులతో ఫోన్‌లో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

మేలు చేశారు.. జీవితాంతం మరువం



మంత్రి రోజాను సన్మానిస్తున్న 1998 డీఎస్సీ ఉపాధ్యాయులు

నగరి: డీఎస్సీ రాసి ఉద్యోగం కోసం రెండు దశాబ్దాలకు పైగా ఎదురుచూశామని, తమ కష్టాలను అర్థం చేసుకుని ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఉద్యోగాలు ఇప్పించారని డీఎస్సీ 1998, కాంట్రాక్ట్ బేసిస్ 2008 ఉపాధ్యాయులు తెలిపారు. వారు శనివారం మంత్రి ఆర్కే రోజాను క్యాంప్ కార్యాలయంలో కలిశారు. తమ కష్టాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో ప్రధాన పాత్ర వహించిన మంత్రిని చందన మాలతో సత్కరించారు. ఎంతో మేలు చేశారని, జీవితాంతం గుర్తుంచుకుంటామని పేర్కొన్నారు. జగనన్న ఆశీస్సులతో 24 ఏళ్ల కల నిజమైందన్నారు. ప్రస్తుతం తమను 10 నెలల జీతంతో నియమించారని, తమకు ఒక్కరోజు గ్యాప్‌తో 12 నెలల జీతం ఇప్పించేలా, విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచడంతోపాటు పెన్షన్ ఇచ్చేలా ప్రభుత్వానికి తెలియజేయాలని కోరారు. దీనిపై మంత్రి స్పందిస్తూ తగిన చర్యలు తీసుకుంటానన్నారు.

ఉచిత శిక్షణా తరగతులు ప్రారంభం

నగరి: నిరుద్యోగ యువతకు పినాకా సంస్థ అధినేత బి.యాదగిరి ఐఆర్ఎస్ ఆధ్వర్యంలో ఉచిత స్పోకెన్ ఇంగ్లిష్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ శిక్షణ కార్యక్రమం శనివారం ప్రారంభించారు. జూన్ 2వ తేదీ వరకు స్థానిక ఎస్‌సీఎన్ (జీహెచ్ఎస్) బాలికల ఉన్నత పాఠశాలలో శిక్షణ జరుగుతుందని ఎంఈఓ శ్రీదేవి తెలిపారు. బ్యాంకింగ్, గ్రూప్ డిస్కషన్, సివిల్ సర్వీసెస్, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు, రైల్వే, స్టాఫ్ సెలక్షన్ కమిషన్ పోటీ పరీక్షలకు ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అలాగే అభ్యర్థులకు మధ్యాహ్నం ఉచిత భోజన సౌకర్యం కల్పించి స్టడీ మెటీరియల్ కూడా ఇస్తారన్నారు. 2017 నుంచి ప్రతి ఏటా ఈ ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఆమె తెలిపారు. దీన్ని గ్రామీణ ప్రాంతాల అభ్యర్థులు సద్వినియోగం చేసుకుని కొందరు ప్రభుత్వ, ప్రైవేటు సెక్టార్లలో మంచి ఉద్యోగాలు సైతం పొందినట్లు గుర్తు చేశారు. దాదాపు వందమందికి ఉచిత శిక్షణ ఇస్తారని, పూర్తి వివరాలకు కోర్సు డైరెక్టర్ 9394566440 (మునస్వామి) నంబరును సంప్రదించాలన్నారు.



శిక్షణ తరగతిని ప్రారంభిస్తున్న నిర్వాహకులు

ప్రత్యేక నిఘా పెట్టండి

గంగాధరనెల్లూరు(కార్వేటినగరం): వేసవి సెలవుల్లో పిల్లలు ఎక్కడికి వెళ్తున్నారో తల్లిదండ్రులు ప్రత్యేక నిఘా పెట్టాలని ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. శనివారం ఆయన తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుతం స్కూళ్లకు సెలవులు కావడంతో పిల్లలు ఈత సరదా కోసం వెళ్లి నీటి కుంటల్లో మునిగి ప్రాణాలు కోల్పోయి కన్నవారికి తీరని శోకాన్ని మిగిల్చిన సందర్భాలను మనం చూస్తూనే ఉన్నామన్నారు. చిన్నారులు, పిల్లల పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక నిఘా పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పిల్లల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచి ఈత, వాహనాలు నడపడం వంటివాటికి దూరంగా ఉంచాలని సూచించారు. యువత ఉద్యోగులు సెలవుల ముసుగులో పేకాట ఆడడం, పందేలు కాయడం, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పెద్ద శేషవాహనంపై వేణుగోపాలుడు

- అట్టహాసంగా ప్రారంభమైన వేణుగోపాలుని బ్రహ్మోత్సవాలు
- భక్తిశ్రద్ధలతో ధ్వజరోహణం
- నేడు చిన్నశేష వాహనం, రాత్రికి హంసవాహన సేవలు

కార్వేటినగరం: రుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం వేడుకగా ధ్వజారోహణం నిర్వహించారు. శనివార వేకువజామునే స్వామివారిని సుప్రభాతసేవతో మేల్కొల్పి నిత్యకైంకర్యాలు, అభిషేకం, శుద్ధి, తోమాల, పంచాంగ శ్రవణం, అర్చన, పుణ్యాహవచనాలు పూర్తి చేసి ఉత్సవాలను ప్రారంభించారు. తొలిగంటలో నైవేద్యం సమర్పించారు. 6 గంటలకు రుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలుడి సర్వసైన్యాధ్యక్షుడు విశ్వక్సేనుడుతో కలసి మాడవీధుల్లో ఊరేగింపునకు బయలుదేరారు. లోకకల్యాణం కోసం నిర్వహిస్తున్న ఈ బ్రహ్మోత్సవాలు నిర్విఘ్నంగా జరగడానికి విశ్వక్సేనుడు అష్టదిక్పాలకులను ఆహ్వానించి ఆలయ మాఢవీధుల్లో నిర్వహించే కార్యక్రమాన్ని కంకణ భట్టాచార్యులు గోపాలాచారి నిర్వహించారు. అనంతరం 11 గంటల నుంచి 11.30 గంటల మధ్య కర్కాటక లగ్నంలో వేదమంత్రాలు, మంగళవాయిద్యాలు నడుమ గరుడాళ్వార్ చిత్రపటం ఉన్న వస్త్రంతో పాటు పూలమాలలను జోడించి ఆలయంలోని ధ్వజస్తంభాన్ని అధిరోహించారు. సాయంత్రం 5.30 నుంచి 6 గంటలకు మధ్య ఉభయ దేవేరులతో పాటు శ్రీవేణుగోపాలున్ని పట్టు వస్త్ర సుగంధభరిత పుష్పాలు, విశేష ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి తిరుచ్చి వాహనంపై వేంచేపు చేసి ఆలయ ఆవరణలోని ఊంజల్ మండపానికి చేర్చి కనుల పండువగా ఊంజల్ సేవ నిర్వహించారు.



వేణుగోపాలస్వామి ఆలయంలో ధ్వజారోహణం నిర్వహిస్తున్న వేదపండితులు.



పెద్దశేషవాహనంపై ఉభయనాంచారులతో పురవీధుల్లో ఊరేగుతున్న శ్రీవేణుగోపాలుడు

అలరించిన సంగీత కచేరీ..

టీటీడీ ఆధ్వర్యంలో అన్నమాచార్య కళామందిరం వారు నిర్వహించిన సంగీత కచేరీ భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. వివిధ రకాల భక్తిగీతాలను ఆలపించి స్వామివారిని పరవశింపజేశారు.

పెద్దశేషవాహనంపై వేణుగోపాలుడి విహారం..

వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటి రోజు శనివారం రాత్రి ఉభయ నాంచారులతో పాటు శ్రీవేణుగోపాలుడు పెద్దశేషవాహనంపై భక్తుల కోలాటాలు, చెక్కభజనల మధ్య పురవీధుల్లో దర్శనమిచ్చారు. భక్తులు ఇంటింటా కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం 9.45 గంటలకు వేదపండితులు స్వామివారిని ఏకాంత సేవలో పవళింప చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ నాగరత్న, ఏఈఓ మోహన్, సూపరింటెండెంట్ రమేష్‌బాబు, ఆలయ అధికారి సురేష్‌కుమార్, కంకణభట్టు గోపాలాచారి, నారాయణదాసరి, కిరణ్ భట్టాచార్యులు, సుందరవరదాచార్యులు పలువురు వేదపండితులు, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు చిన్నశేష వాహన సేవలు..

ఆదివారం ఉదయం స్వామివారు ఉభయ దేవేరులతో పాటు చిన్నశేష వాహనంపై పురవీధుల్లో ఊరేగనున్నట్లు ఆలయ అధికారి సురేష్‌కుమార్ తెలిపారు. అలాగే స్వామివారికి నిత్యకైంకర్యాలు ఉంటాయని, రాత్రికి హంసవాహనంపై స్వామివారు విహరించనున్నట్లు చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకోవాలని కోరారు.

కూరగాయలతో రక్తహీనత దూరం

కార్వేటినగరం: విద్యార్థుల్లో ప్రధానంగా నెలకొనే రక్తహీనతను సాధారణంగా అందుబాటులో ఉండే కూరగాయలు తినడం ద్వారా నివారించవచ్చని సైన్స్ ఉపాధ్యాయుడు మునిరాజా అన్నారు. గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణలో భాగంగా శనివారం రక్తహీనతను నిర్మూలించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అందుబాటులో ఉంటూ అతి తక్కువ ధరకే లభించే ఆకుకూరలను తినడం వల్ల రక్తహీనతతో పాటు అనేక రోగాలకు చెక్ పెట్టవచ్చని సూచించారు. అలాగే సూర్యరష్మి వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు క్షుణ్ణంగా వివరించారు. విద్యార్థులు ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి శంకర్‌బాబు, విద్యార్థులు పలువురు పాల్గొన్నారు.



జాగ్రత్తలను చెబుతున్న టీచర్ మునిరాజా

ఆధ్యాత్మిక చింతన అవసరం

పుత్తూరు రూరల్: ప్రతి ఒక్కరికీ ఆధ్యాత్మిక చింతన అవసరమని పుత్తూరు శ్రీరామకృష్ణ సమితి అధ్యక్షుడు కె.మునికృష్ణ తెలిపారు. శనివారం రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ సమావేశం అధ్యక్షుడు బి.భాస్కర్‌రాజు అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన మునికృష్ణ మాట్లాడుతూ నేటి ఉరుకులు, పరుగుల సమాజంలో ప్రశాంతత ఒక్క ఆధ్యాత్మిక చింతనతోనే సాధ్యమని చెప్పారు. ఇందుకు ప్రతిరోజూ శ్రీరామకృష్ణుల దివ్య స్పర్శ పుస్తకాన్ని చదవాలని సూచించారు. ఈ సందర్భంగా దివ్య స్పర్శ పుస్తకాలను అందరికీ పంపిణీ చేశారు. ఆడిటర్ రామకృష్ణ మాట్లాడుతూ విలువలతో కూడిన ఆదాయపు పన్ను విషయాలను వివరించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు యుగంధర్‌రాజు, గుణశేఖర్‌రెడ్డి, కుప్పయ్య, రామలింగం, రమేష్, నారాయణరెడ్డి, వెంకటకృష్ణ, చంద్రశేఖర్, వర్మ, రామ్మూర్తి, రఘురామయ్య పాల్గొన్నారు.



దివ్య స్పర్శ పుస్తకాలను ప్రదర్శిస్తున్న నాయకులు